andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8, కనిష్ఠం 16.6
నిర్మల్ జిల్లా వార్తలు
8
బుధవారం 3 జనవరి 2024



మున్సిపల్ అక్రమాలపై కౌన్సిలర్‌ల ఫిర్యాదు

నిర్మల్ కల్చరల్, జనవరి 2 : నిర్మల్ మున్సిపాలిటీలో జరిగిన అక్రమాలపై మంగళవారం అదనపు కలెక్టర్ ఫైజాల్ అహ్మద్‌కు కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎజెండాలో పొందుపరిచిన పనులకు సంబంధించి కేటాయింపులు ఇష్టానుసారంగా పెంచారని ఆరోపించారు. బతుకమ్మ పండుగ, మెప్మా, సిమెంట్ పైపులు తదితర వాటిలో అధికారులతో కుమ్మక్కై చైర్మన్ అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అవినీతి అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో దర్యాప్తు చేయాలని వారు డిమాండ్ చేశారు.





బీఆర్‌ఎస్‌లో గందరగోళం



నిర్మల్ మున్సిపల్ అక్రమాలపై అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్‌లు

- బీఆర్‌ఎస్‌లో కరువైన దిశా నిర్దేశం
- మూడు సెగ్మెంట్‌లలో పట్టుతప్పుతున్న కేడర్
- పార్టీ జిల్లా అధ్యక్షుడి నాయకత్వం లోపం
- ఇప్పటి వరకు జరగని సమీక్ష సమావేశం
- సొంత ప్రజా ప్రతినిధులపైనే అవిశ్వాసాలు
- గాడితప్పిన నాయకత్వం

నిర్మల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల్లో ఘోర ఓటమి చవి చూసిన బీఆర్‌ఎస్ పార్టీ పరిస్థితి ప్రస్తుతం గందరగోళంగా మారిందని అంటున్నారు. మూడు నియోజకవర్గాల్లోని పార్టీ కేడర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమ నాయకులపైనే బాహాటంగా విమర్శలు చేస్తున్నప్పటికీ వారిని అదుపు చేసే నాయకత్వమే కరువైందని అంటున్నారు. ముఖ్యంగా ఆ పార్టీ అధ్యక్షునిగా వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఇప్పటి వరకు ఈ మూడు నియోజకవర్గాల్లోని పార్టీ సీనియర్ నాయకులతో గాని, కేడర్‌తోని గాని సమీక్ష సమావేశం జరపకపోవడం విమర్శలకు తావిస్తోంది. సీనియర్‌లు, ద్వితీయశ్రేణి నేతలంతా తలోదిక్కుగా ఉంటూ పార్టీపైనే ధిక్కారం స్వరం వినిపిస్తున్నప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదంటున్నారు. ఓటమి చెంది నెల రోజులు కూడా గడవకముందే తమ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులపై బీజేపీ, కాంగ్రెస్‌ల కన్నా ముందుగానే ఆ పార్టీ నేతలే అవిశ్వాసాలకు రంగం సిద్ధం చేస్తుండడం ఆ పార్టీ పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందని అంటున్నారు. గత నెల రోజుల నుంచి పార్టీలో క్రమశిక్షణ పూర్తిగా లోపించిందని నేతలు, కేడర్ అంతా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ క్రమశిక్షణను బాహాటంగానే విమర్శిస్తున్నారంటున్నారు. ఏకంగా జడ్పీ చైర్మన్‌పైనే కొంతమంది బీఆర్‌ఎస్ పార్టీ జడ్పీటీసీలు తిరుగుబాటు జెండాను ఎగురవేసేందుకు సిద్ధమయ్యారంటే ఆ పార్టీలో నెలకొన్న అసహనం ఎంత తీవ్రస్థాయికి చేరుకుందో అవగతమవుతోందని అంటున్నారు. దీంతో పాటు నిర్మల్, భైంసా మున్సిపల్ చైర్మన్‌లు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారే అయినప్పటికీ వారిపై కూడా అవిశ్వాస తీర్మానాలకు రంగం సిద్ధం చేస్తు న్న సంగతి తెలిసిందే. ఖానాపూర్‌లో ఈ నెల 5వ తేదీన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరగబోతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. అక్కడి చైర్మన్, వైస్ చైర్మన్‌లు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారే అయినప్పటికీ ఆ పార్టీకి చెందిన మెజారిటీ కౌన్సిలర్‌లు కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో మిలాఖతై సొంత పార్టీలోని వారికే చెక్ పెడుతుండడం చర్చకు తావిస్తోంది. అలాగే మొన్నటి వరకు అప్పటి బీఆర్ ఎస్ పార్టీ హయాంలో మంత్రి ప్రాతినిధ్యం వహించిన నిర్మల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీలో కూడా ఇక్కడి చైర్మన్‌పై సొంత పార్టీ కౌన్సిలర్‌లే బాహాటంగా విమర్శలు చేస్తూ కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసిన సంఘటన దుమారం రేపుతోంది. ఇలా ఆరోపణలు చేసిన వారిలో ప్రధానంగా బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్‌లే కీలకపాత్ర పోషించడం చర్చనీయాంశమవుతోంది. దీంతో పాటు మండలాల్లో అక్కడి బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీపీలపై కూడా సొంత పార్టీ ఎంపీటీసీలే అవిశ్వాస పర్వానికి తెరలేపుతున్నారు. సొంత పార్టీ ఎంపీటీసీల రాజకీయాలను తట్టుకోలేక సారంగాపూర్ ఎంపీపీ, వైస్ ఎంపీపీలు ఇప్పటికే తమ పదవులకు రాజీనామాలు చేసిన సంగతి తెలిసిందే. ఇలాంటి తీవ్రమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నప్పటికి పరిస్థితులను అదుపు చేస్తూ పార్టీ నేతల మధ్య సమన్వయం కుదుర్చాల్సిన జిల్లా అధ్యక్షులు గాని, మాజీ మంత్రి గాని ఈ దిశగా స్పందించకపోవడంపై గందరగోళం నెలకొంటోంది.

సొంత ప్రజా ప్రతినిధులపైనే అవిశ్వాసాలు

కాగా కాంగ్రెస్, బీజేపీ ప్రజా ప్రతినిధులకు బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులే స్వయం గా వంత పాడుతుండడం అంతటా కలకలం రేపుతోంది. తమ పార్టీ ప్రజా ప్రతినిధులను కాపాడుకోవాల్సిన ఎంపీటీసీలు, కౌన్సిలర్‌లు తిరుగుబాటు బాట పడుతుండడం ఆ పార్టీలో అయోమయ పరిస్థితులకు అద్దం పడుతోందని అంటున్నారు. ఇప్పటికే ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, నిర్మల్ మున్సిపల్ చైర్మన్‌లపై అవిశ్వాసాలతో పాటు అవినీతి, అక్రమాల పేరిట ఆరోపణలు చేస్తున్నప్పటికీ వారిని అధిష్ఠానం అదుపు చేయకపోతుండడం వివాదాస్పదమవుతోంది. అలాగే జడ్పీ చైర్‌పర్సన్, ఎంపీపీలపై కూడా తిరుగుబాటు జరుగుతున్నప్పటికి ఇప్పటి వరకు జిల్లా అధ్యక్షులు ఏ ఒక్కరిని హెచ్చరించడం గాని వారితో సంప్రదింపులు గాని జరపకపోవడం కూడా పార్టీలో అంతర్గత విభేదాలకు కారణంగా పేర్కొంటున్నారు.

గతితప్పిన నాయకత్వం

ఇదిలా ఉండగా ఓటమి భారం నుంచి బయట పడని బీఆర్‌ఎస్ పార్టీ తన నాయకత్వం పటిమను కోల్పోయిందన్న వాదనలు తెరపైకి వస్తున్నారు. ముఖ్యంగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గాని, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు విఠల్‌రెడ్డి గాని ఇప్పటి వరకు పార్టీ పరిస్థితులపై సమీక్ష జరపకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీంతో సొంత పార్టీ స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ నేతలపైనే అవిశ్వాస తీర్మాణాలు ప్రవేశపెడుతున్నప్పటికి జిల్లా అధ్యక్షులు ఇప్పటి వరకు ఈ వ్యవహారాలపై దృష్టి సారించకపోతుండడం నాయకత్వ లోపానికి నిదర్శమంటున్నారు. ఓటమి చెందగానే ఇక ఆ పార్టీతో తమకు ఎలాంటి సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్న ద్వితీయశ్రేణి నాయకులు, కేడర్‌ను జిల్లా అధ్యక్షుని స్థాయిలో ఆయన హెచ్చరించకపోతుండడం చర్చకు తావిస్తోంది. మొత్తానికి గత నెల రోజుల నుంచి బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వం లోపంతోనూ అలాగే సమన్వయ లోపంతోనూ సతమతమవుతున్నప్పటికీ అటు హైకమాండ్ గాని, ఇటు జిల్లా అధ్యక్షులు గాని నోరు మెదపకపోతుండడం ఆ పార్టీ భవిష్యత్‌పై గట్టి ప్రభావం చూపే అవకాశాలున్నాయని అంటున్నారు.







సుదర్శన యాగంలో పాల్గొన్న భక్తులు

దేవరకోట ఆలయంలో వైభవంగా సుదర్శన యాగం

నిర్మల్ కల్చరల్, జనవరి 2 : నిర్మల్‌లోని దేవరకోట లక్ష్మీ వెంకటేశ్వరాలయంలో మంగళవారం సుదర్శనయాగం వైభవంగా నిర్వహించారు. భీమవరం పీఠాధిపతి త్రిదండి రామచంద్ర జియ్యర్‌స్వామి ఆధ్వర్యంలో ఆయన చేతుల మీదుగా ధనుర్మాస సందర్భంగా ఈ యాగం నిర్వహించారు. ఆలయ అర్చకులు నవీన్ కుమార్ టీకే రామకన్నన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆమెడ శ్రీధర్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. పట్టణ ప్రజలు ఈ యాగానికి హాజరయ్యారు.

రాములవారి అక్షింతల ఊరేగింపు



అక్షింతలతో ఊరేగింపు

నిర్మల్ కల్చరల్, జనవరి 2 : అయోధ్య రాములవారి అక్షింతలు మంగళవారం గాంధీచౌక్ హనుమాన్ ఆలయం నుంచి గుట్టకింది హనుమాన్ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. శివరాం, అన్వేష్, చంద్రశేఖర్, స్థానికులు పాల్గొన్నారు.

ముథోల్ : మండలంలోని చించాల, తరోడా గ్రామాల్లో మంగళవారం అయోధ్య అక్షింతల సందర్భంగా తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షింతల కలశాలతో శ్రీ రాములోరి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆయా వీధుల్లో గ్రామ పెద్దలు, గ్రామస్థులు, మహిళలు మంగళహారతులతో అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ రాములోరి భక్తి భజనలు చేస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించి, ఆంజనేయ మందిరానికి చేరుకున్నారు. రక్ష స్తోత్రము, పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

శబరికి బయలుదేరిన అయ్యప్ప స్వాములు

కుంటాల, జనవరి, 2 : మండలంలోని కల్లూర్ గ్రామం నుండి మంగళవారం శబరిమలైకి అయ్యప్పస్వాములు బయలు దేరి వెళ్లారు. గత 41 రోజుల నుండి నియమనిష్ఠలతో దీక్ష చేపట్టిన స్వాములు మంగళవారం ఇరుముడి నెత్తిన పెట్టి స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేక వాహనంలో శబరిమలై బయలుదేరి వెళ్లారు.

బ్రహ్మకుమారీల క్యాలెండర్ ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, జనవరి 2 : బ్రహ్మకుమారీల నూతన సంవత్సర క్యాలెండర్ మంగళవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుల రాంనాథ్, విద్యాసాగర్, శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజన పథకం కార్మికుల బిల్లులు చెల్లించండి'

నిర్మల్ కల్చరల్, జనవరి 2 : కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం నిర్వహించే కార్మికుల బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ అధ్యక్షుడు భూక్యా రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. బిల్లులు అందక కార్మికులు మానసికంగా ఆందోళన చెందుతున్నారన్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుతో పాటు ప్రతి 5వ తేదీలోగా బిల్లులు చెల్లించాలని, డ్రెస్ కోడ్, మౌలిక సౌకర్యాలు, తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. లక్ష్మి, చిట్యాల లక్ష్మి, హంస, ప్రమీల, విమల, తదితర కార్మికులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ త్వరగా చెల్లించాలి

ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన జీపీఎఫ్ బిల్లులు త్వరితగతిన చెల్లించాలని ఎస్‌టీయూ డిమాండ్ చేసింది. మంగళవారం జడ్పీ సీఈవోకు వినతిపత్రం అందజేశారు.

ప్రజాపాలనలో దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్



దరఖాస్తులను పరిశీలిస్తున్న జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్

నిర్మల్ రూరల్, జనవరి 2 : ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా మంగళవారం కలెక్టర్ వివిధ వార్డుల్లో, గ్రామాల్లో పర్యటించి దరఖాస్తుల స్వీకరణ, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అభయహస్తం కార్యక్రమంలో ఆరు గ్యారంటీలను అమలు పరచడానికి అర్హులైన ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి అలసత్వం వహించకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలతో దరఖాస్తుల స్వీకరణను విజయవంతం చేయాలన్నారు. ఇంకా నాలుగు రోజుల వరకు కొనసాగుతుందని అర్హులైన వారు తప్పక దరఖాస్తు చేసు కోవాలని తెలిపారు. గ్రామాల్లో, వార్డుల్లో ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణలో అన్ని సదుపాయాలు కల్పించాలని, తాగునీరు, కుర్చీలు, కౌంటర్ల వారీగా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం ఆయా కేంద్రాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రక్రియను స్వయంగా పరిశీలించి దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వీకరించాలని, ప్రతి కేంద్రంలో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు ఎలాంటి సందేహాలు ఉన్న తెలుసుకోవచ్చన్నారు. ప్రతి కేంద్రంలో దరఖాస్తు ఫారాలు సిద్ధంగా అందుబాటులో ఉన్నాయన్నారు. రాంనగర్ పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్య సిబ్బంది అందరూ సకాలంలో హాజరు అవుతున్నారా, బయోమెట్రిక్ విధానం కొనసాగుతుందా అని అడిగి తెలుసుకొని స్టాక్ రూమ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, ఎంఆర్‌వోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

నిర్మల్ కల్చరల్ : జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం మినీ సమావేశ మందిరంలో అధికారులతో కలిసి నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేశారు. శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం సుఖ సంతోషాలతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, డీఆర్‌వో లోకేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న కలెక్టర్

ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ముందుంటా : ఎమ్మెల్యే ఏలేటి



పరిమండల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

మామడ, జనవరి 2 : ప్రజల సమస్యలు పరిష్కరించడానికి నియోజకవర్గంలో ముందుంటానని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మామడ మండలంలోని పొన్కల్, కొరిటికల్, పరిమండల్ గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభయహస్తం దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందే వరకు ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేయాలని లేకుంటే ప్రజల పక్షాన పోరాడుతామని తెలిపారు. పొన్కల్ నూతన మండలం కోసం కృషి చేస్తానని తెలిపారు. రాబోయే రోజుల్లో నిర్మల్ నియోజకవర్గంలో ప్రతి అభివృద్ధికి తోడ్పడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు భూమేశ్వర్, పొటుకూరి భోజవ్వ బాపురెడ్డి, ఎంపీటీసీలు భాగ్యలక్ష్మి రాజారెడ్డి, రాధా ముత్యం, చరణ్య జాలం నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చిన్నారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిర్మల్ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జాం గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామస్తులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ ప్రజా పాలన కార్యక్రమంలో జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ మురళీకృష్ణ, ఎంపీడీవో సరోజ, ఆయా శాఖల అధికారులు, నాయకులు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నిర్ధారణ సులువు

- నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి

ఖానాపూర్, జనవరి 2 : సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నిర్ధారణ సులువవుతుందని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. మంగళవారం ఖానాపూర్‌లోని రాజీవ్ నగర్ కాలనీలో ఫ్రెండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 40 కుటుంబాలు తలా కొన్ని డబ్బులు పోగు చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని డీఎస్పీ కొనియాడారు. ఇటీవల కాలంలో ఖానాపూర్‌లో దొంగల అలజడి నేపథ్యంలో కాలనీ వాసులు ఏకమై తమ కాలనీలో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ సీఐ మోహన్, ఎస్సై లింబాద్రి, తదితరులున్నారు.

'అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి'

దిలావర్‌పూర్, జనవరి 2 : అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని షీటీం బృందం సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫోన్‌లో మాట్లాడేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సైబర్ క్రైమ్ నేరాలు... తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అపాయకర, అత్యవసర పరిస్థితుల్లో 100కు ఫోన్ చేస్తే తక్షణమే స్పందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో అపర్ణ, షీ టీం సభ్యులు సుమంగళి, రమాదేవి, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసిన డీఈవో



విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈవో

నిర్మల్ కల్చరల్, జనవరి 2 : జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి మంగళవారం నిర్మల్ మండలం ముజ్గి ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. పరీక్షలకు సిద్ధం కావాలని, మంచి ఫలితాలు సాధించాలన్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ, సిలబస్ పూర్తి తదితర అంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని మధ్యాహ్న భోజన కార్మికులకు సూచించారు. ఏఎంవో నర్సయ్య, హెచ్‌ఎం సుధీర్ పాల్గొన్నారు.

ఉరివేసుకొని ఒకరి ఆత్మహత్య

నర్సాపూర్(జి), జనవరి 2 మండలంలోని కుస్లి గ్రామంలో మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆలూరి రవి (35) మృతి చెందాడు. స్థానికుల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్నం పన్నెండు గంటల సమయంలో భార్యతో మద్యం సేవించడానికి డబ్బులు అడుగగా ఆమె నిరాకరించడంతో ఇంట్లో గదిలోకి వెళ్లి ఫ్యానుకు ఉరివేసుకోగా ఇంట్లోవారు నిర్మల్ ఏరియా ఆసుపత్రికి వెళ్ళగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించడతో తండ్రి ఆలూరి రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

నిర్మల్ కల్చరల్, జనవరి 2 : ఆస్తి పంపకం విషయంలో చోటుచేసుకున్న తగాదా కారణంగా షేక్ బషీర్ అనే నిందితుడు తండ్రి, తమ్ముడితో గొడవపడి హత్యాయత్నం చేసినందుకు గాను ఐదేళ్ల జైలుశిక్షతో పాటు 2 వేల రూపాయల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్ జడ్జి కే.అజేష్‌కుమార్ మంగళ వారం తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయ అధికారి సక్రియా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. బాధితుడు షైక్ రఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసిన పోలీసు అధికారులు రిమాండ్‌కు పంపారు. 23 నవంబరు 2021లో నిందితుడు కత్తితో చంపేందుకు ప్రయత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పీపీ వై. రమణారావు 11 మంది సాక్షులను విచారించగా నేరం రుజువైనట్లు తెలిపారు.

అభయహస్తం గ్యారెంటీలు ఉపయోగించుకోవాలి : చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, జనవరి 2 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అభయహస్తం ఆరు గ్యారంటీలను అర్హులైన లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన 20వ వార్డు బర్కత్‌పురా ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలనలో పాల్గొన్నారు. దరఖాస్తుల స్వీకరణ పరిశీలించారు. అభయ హస్తంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దర ఖాస్తులు స్వీకరణకు ప్రత్యేకకౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దరఖాస్తు ఫారాలు అందజేస్తామని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. స్థానిక కౌన్సిలర్ ముజాహిద్ చావుస్, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు

భైంసా, జనవరి 2 : బాలలను ఎవరు పనిలో పెట్టుకున్న చట్టపరమైన చర్యలు తప్పవని ఆపరేషన్ స్మైల్ భైంసా డివిజన్ అధికారి నారాయణ సింగ్, బాలల సంరక్షణ అధికారి శ్రీనివాస్‌లు పెర్కొన్నారు. మంగళవారం భైంసా పట్టణ పరిధిలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా పలు వ్యాపార సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నిరాశ్రయులైన చిన్నారులు, బాల కార్మికుల రక్షణ కోసం ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా వెల్లడించారు. రోడ్లపై భిక్షాటన చేస్తూ, కూడళ్లలో సరుకులు విక్రయిస్తున్న వారితో పాటు అక్రమ రవాణకు పాల్పడుతున్న చిన్నారులను రక్షించి వారికి పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా ఇప్పటి వరకు పది విడతలుగా అపరేషన్ స్మైల్ నిర్వహిస్తూ వస్తోందన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలు కొనసాగుతున్నట్లుగా వివరించారు. బాల కార్మిక వ్యవస్థ , బాలల భిక్షాటన నిర్మూలనకు ప్రతి ఒక్కరు బాధ్యతగా గుర్తించి సహకరించాలన్నారు. బాలలను ఎవరు కూడా ఎలాంటి పరిస్థితిల్లోనూ పనుల్లో పెట్టుకోకూడదని సూచించారు. ఇందులో కౌన్సిలర్ మమత, హెడ్ కానిస్టేబుళ్లు మహిళా కానిస్టేబుల్ అనుప్రియలు పాల్గొన్నారు.

మహిళా సాధికారిత దిశగా చర్యలు

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 2: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మహిళా సాధికారిత దిశగా చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం స్థానిక కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఆర్యవైశ్య వాసవి మహిళా మండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఆర్యవైశ్య మహిళా విభాగ్ రాష్ట్ర అధ్యక్షురాలు విప్పుల శారద, ఎమ్మెల్యే పాయల శంకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంఘం గౌరవ అధ్యక్షురాలిగా ఉపలంచివార్ రాగిని, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రియాంక మహాజన్, సిస్మిత పడిగెలవార్, కోశాధికారి అశ్విని గాదెవార్‌లతో పాటు కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీలో చోటు దక్కించుకున్న ఆదిలాబాద్‌కు చెందిన ధీకొండవార్ భార్గవి, పోల పారిజాతలను ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ చట్ట సభల్లో 33 శాతం మహిళ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించడం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సాధించిన గొప్ప విజయమన్నారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిందన్నారు. ఏ ప్రభుత్వమైన మహిళలకు విశేష ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేయడం హర్షనీయమన్నారు. ఆదిలాబాద్‌కు చెందిన ఆర్యవైశ్య మహిళకు కీలకమైన నామినేట్ పదవి దక్కేలా తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షురాలు పుప్పాల శారద మాట్లాడుతూ సంఘం కోసం ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. గతంలో ఆదిలాబాద్ రావాలంటే రవాణా పరమైన తీవ్ర ఇబ్బందులుండేవని, ఆరు వరుసల జాతీయ రహదారితో ప్రయాణం ఎంతో సులువైందన్నారు.



ఆదిలాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య

బజార్‌హత్నూర్, జనవరి 2: ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య అన్నారు. మండలంలోని బజార్‌హత్నూర్, దేగామ, భూతాయి తదితర గ్రామ పంచాయతీల్లో అధికారులు ప్రజాపాలనలో చేపడుతున్న ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లను చేశారు. ప్రత్యేక అధికారులు అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పథకాలను అర్హులందరికీ అందుతాయన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శంకర్, ఎంపీడీవో రాథోడ్ రాధ, ఇరిగేషన్ డీఈ భీంరావు, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, సర్పంచులు పర్వ లావణ్య, ధుర్వ లక్ష్మణ్, పడ్వాల్ కవిత, కార్యదర్శులు సునీల్, లుక్మణ్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం



అక్షింతలతో రామ భక్తులు, గ్రామస్థులు

రామయ్య అక్షింతల ఊరేగింపు

తాంసి, జనవరి 2: అయోధ్య శ్రీరామ మందిరం ప్రతిష్ఠ మహోత్సవానికి సంబంధించిన అక్షింతలు మండల కేంద్రంలోని రామేశ్వరాలయానికి సోమవారం చేరుకున్నాయి. కాగా మంగళవారం ప్రత్యేక పూజల అనంతరం మండలంలోని 16 గ్రామాలకు అక్షింతలు, రామ మందిరంలో ఫొటో, కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘ్ చాలక్ ప్రతాప్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బొండ్ల నారాయణ, సహాయ కార్యదర్శి దత్తతేయ, భజరంగ్ దళ్ ప్రముఖ్ సంతోష్, సర్పంచ్ కేశవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండలంలోని తోషం గ్రామంలో మంగళవారం అయోధ్య రామజన్మ భూమి క్షేత్ర నుంచి వచ్చిన అక్షింతల శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం నుంచి అక్షింతలతో గ్రామానికి రాగా.. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో అక్షింతలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. రామ నామాన్ని జపిస్తూ హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

జైనథ్: మండలంలోని సావాపూర్ గ్రామానికి మంగళవారం జిల్లాకేంద్రం ఆదిలాబాద్ నుంచి అయోధ్య రాముడి అక్షింతలు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలో డప్పులు భాజాల మధ్య అక్షింతలను తలపై పెట్టుకుని పలు వీధుల గుండా శోభాయాత్రను నిర్వహించి స్థానిక హనుమాన్ ఆలయంలో పెట్టి వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, ఉప సర్పంచ్ రవీందర్, మాజీ సర్పంచ్ జి.సునిల్, గ్రామస్థులు పాల్గొన్నారు.



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

వైభవంగా అయ్యప్ప పడిపూజ

ఉట్నూర్, డిసెంబరు 2: మండల కేంద్రంలోని శ్రీహరిహర క్షేత్రం వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పడిపూజ కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అయ్యప్ప ఆలయం వద్ద ఉన్న 18 మెట్ల పడిపూజ కార్యక్రమానికి గురు స్వామి చక్రవర్తుల పురుషోత్తమచార్యులు హాజరై పడిపూజ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వందలాది మంది స్వాములు హాజరైన ఈ కార్యక్రమంలో గురుస్వాములు అయ్యప్ప పాటలు పాడుతూ భజనలు చేశారు. ఇందులో రిటైర్డ్ డాక్టర్ కృష్ణస్వామి, గురుస్వామి దీపక్‌దూబే, ఆడేదన్ లాల్‌నాయక్, తొగిటి నాగభూషణం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'దళారులను నమ్మి మోసపోకండి'

తలమడుగు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాల కోసం దళారులు నమ్మి మోసపోవద్దని గ్రామసభల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని సుంకిడి, తలమడుగు, కప్పర్‌దేవి గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి సంక్షేమ అభివృద్ధి పథకాలను అందించేందుకు ఆరు గ్యారెంటీ స్కీంలను ప్రవేశ పెట్టిందన్నారు. గత ప్రభుత్వం లాగా దళారుల బెడద లేకుండా నేరుగా గ్రామ సభల ధోరణి లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఈనెల 6న లబ్ధిదారులు దరకాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం సుంకిడి గ్రామంలో దరఖాస్తు స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో ఎంపీపీ కళ్యాణం లక్ష్మిరాజేశ్వర్, నోడల్ ఆఫీసర్ మహావీర్, ఎంపీడీఓ రమాకాంత్, తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంఈవో నారాయణ, ఎంపీవో దలీప్, సర్పంచ్‌లు మహేందర్, కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

● కొనసాగుతున్న ప్రజా పాలన సభలు

సిరికొండ: మండలంలోని సుంకిడి, పొన్న, తదితర గ్రామ పంచాయతీల పరిధిలో ఎంపీడీవో సురేష్ మంగళవారం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కానిందే చంద్రకళ, జాదవ్ అనిత రోహిదాస్, పంచాయతీ కార్యదర్శులు అరుణ్ కుమార్, అజ్మత్, గ్రాసుమ్థులు పాల్గొన్నారు.

బోథ్‌లో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

బోథ్, జనవరి 2: మండల కేంద్రంలో మంగళవారం బోథ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ఎన్ఎస్‌యూఐ సభ్యులతో పాటు స్పాన్సర్ మిర్షద్ అలీ ప్రారంభించారు. ఎన్ఎస్‌యూ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడా పోటీల్లో పట్టణానికి చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

ఐటీ టవర్ నిర్మాణం పూర్తయితే నిరుద్యోగులకు ఉపాధి : చైర్మన్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 2: ద్వితీయ శ్రేణి నగరాలకు సైతం ఐటీ సేవలను విస్తరింప చేయాలన్న ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.నలభై కోట్ల వ్యయంతో ఐటీ టవర్‌ను మంజూరు చేసిందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. నిర్మాణంలో ఉన్న ఐటీ టవర్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. టవర్ నిర్మాణ పనులను పర్యవేక్షించి సంబంధిత అధికారులతో పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఐటీ టవర్ నమూనాను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ ఐటీ టవర్ నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా వెయ్యి మందికి, పరోక్షంగా రెండు వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఇప్పటికే ఆదిలాబాద్‌లో ఐటీ సేవలు ప్రారంభం కావడంతో అనేక మంది యువతకు ఉపాధి లభించిందని తెలిపారు. నిర్మాణంలో ఉన్న టవర్‌కు ఎటువంటి అడ్డంకులు లేకుండా పనులు పూర్తి చేయాలని, ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నేతృత్వంలో ఆదిలాబాద్‌కు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, వ్యవసాయ కళాశాల మంజూరైన విషయాన్ని గుర్తు చేశారు. అభివృద్ధికి తమవంతు పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పవన్‌నాయక్, కలీం, సునిల్, మహేశ్, చందర్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

● ఉపాధి హామీ పథకం ప్రజా వేదికలో డీఆర్డీవో కిషన్

ఇంద్రవెల్లి, జనవరి 2: జాతీయ గ్రామీణ ఉపాదిహామీ పథకం ద్వారా కూలీలకు కల్పిస్తున్న ఉపాధి పనులను సద్వినియాగం చేసుకోవాలని డీఆర్డీవో కిషన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయ అవరణలో ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఎంపీపీ పోటే శోభాబాయి అధ్యక్షతన నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2022, ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు రూ.7 కోట్ల 40 లక్షలతో కూలీలకు కల్పించిన పనులతో పాటు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీలో చేపట్టిన పనులతో పాటు వాటి ఖర్చుల వివరాలను గ్రామ పంచాయతీల వారీగా ప్రజా వేదికల్లో డీఆర్డీవో వివరించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో కిషన్ మాట్లాడుతూ. ఉపాధి హామీ పథకం పనుల్లో ఎలాంటి అవకతవకలతోపాటు అక్రమాలు జరగలేదన్నారు. రూ.7 కోట్ల 40 లక్షలతో వివిధ రకాల అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. సామాజిక తనిఖీ సందర్భంగా ఈజీఎస్ సిబ్బందిలు అన్ని రకాల రికార్డులు అందించి చేసిన పనులు క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృందం సభ్యులకు చూయించడంలో పూర్తి సహకారం అందించారన్నారు. ఈజీఎస్ చేసిన చిన్నతప్పులను దృష్టిలో ఉంచికొని సంబంధిత సిబ్బందిలకు షోకాజ్ నోటిసులు జారీ చేసి డబ్బులు రికవరీ చేయడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. దీంతో సామాజిక తనిఖీ రాష్ట్ర పరిశీలకుడు కూడా పనులు చూసి సంతోషం వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో రాథోడ్ రవీందర్, జడ్పీటీసీ ఆర్కా పుష్పలత, ఎంపీడీవో పుష్పలత, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, ఎంపీటీసీ గీత్తే అశాబాయి, సర్పంచ్‌లు గాంధారి శారద, పార్వతిబాయి, విజయ, ఆర్కా పూలబాయి, ఎంపీవో సంతోష్ కుమార్, ఈజీఎస్, ఏపీవో శ్రీనివాస్, టీఏలు సంతోష్, గణేష, మహేందర్, ధమ్మానంద్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్డీవో కిషన్

రిమ్స్‌లో మెరుగైన వైద్యం అందేందుకు కృషి

● ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 2: జిల్లాకేంద్రంలోని రిమ్స్ సూపర్‌స్పెషాలిటి ఆసుపత్రి, మెడికల్ కాలేజ్ ప్రభుత్వాసుపత్రి పని తీరు పై ఎమ్మెల్యే పాయల శంకర్ మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ హాల్లో జరిగిన సమావేశంలో వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ రిమ్స్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు, సిబ్బంది కొరత తదితర అంశాల పై వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడి సమస్యలను తెలియజేస్తామన్నారు. సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో వైద్యులను వెంటనే ఏర్పాటు చేసి ఏ ఒక్క పేషేంట్ కూడా హైదరాబాద్‌కు వెళ్లకుండా స్థానిక సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో చికిత్స అందేవిధంగా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కావాల్సిన నిధులు సమకూరుస్తామన్నారు. ఇందులో వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస గ్రామంలో నాసిరకం నిర్మాణాలు చేస్తే సహించం

● ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన మైసంపేట్, రాంపూర్ గ్రామస్థులు ● ఇష్టారాజ్యంగ నిర్మాణాలు చేస్తున్నారని ఆందోళన



పునరావాస గ్రామంలో ఇళ్లకు పగుళ్లు తేలిన దృశ్యం

ఖానాపూర్, జనవరి 2 : పునరావాస గ్రామంలో చేస్తున్న నిర్మాణాలు నాసిరకంగా ఉన్నాయంటూ మైసంపేట్, రాంపూర్ గ్రామస్థులు ఆరోపించారు. మంగళవారం కడెం మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామ పంచాయతీ పరిధి లో చేపట్టిన పునరావాస గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను, ఆయా అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... తమకు పునరావాసం కల్పించేందుకు చేస్తున్న నిర్మాణాలపై అధికారులు పర్యవేక్షణ చేయడం లేదన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై నిర్మాణాలపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. ఆది వాసీలపై అధికారులు చిన్నచూపు చూస్తే తమ సత్తా ఏంటో చూపుతామన్నారు. ఇప్పటికే పునరావాస గ్రామంలో పూర్తయిన ఇళ్లు, తదితర అభివృద్ధి పనులలో నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి అడవిని వీడి మైదాన ప్రాంతాలకు వచ్చేందుకు సిద్ధపడ్డామన్నారు. తమకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం అన్ని సౌకర్యాలతో పునరావాస గ్రామం నిర్మిస్తుంటే అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. నాణ్యత లోపించి ఇప్పటికై పలు ఇళ్లు పగుళ్లు తేలాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాంపూర్, మైసంపేట్ గ్రామానికి చెందిన పలువురు ఆదివాసీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొజ్జును కలిసిన కౌన్సిలర్లు

ఖానాపూర్, జనవరి 2 : ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జును ఖానాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యేను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కోరినట్లు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫోర్ లీడర్ రాజుర సత్యం ఆంధ్రజ్యోతికి ఫోన్‌లో తెలిపారు.

పెట్రోల్ బంకుల్లో వాహనాదారుల భారీ క్యూ

భైంసా, జనవరి 2 : అయిల్ ట్యాంకర్ల యజమానులు, డ్రైవర్ల సమ్మె నేపథ్యంలో మంగళవారం జిల్లాలోని పెట్రోల్ బంకుల ఎదుట వాహనదారులు భారీగా క్యూ కట్టారు. మధ్యాహ్నం నుంచి ట్యాంకర్ల యజమానులు, డ్రైవర్లు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు దిగారు. ఈ క్రమంలో బంక్‌లకు పెట్రోలు, డిజిల్ సరఫరా అయ్యే అవకాశాలు తగ్గిపోయాయి. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించే పరిస్థితులు నెలకొన్నాయనే భావనతో బంక్‌ల యజమానులు ఫుల్‌స్టాక్ చేయించుకోలేదు. దీంతో చాలా బంక్‌ల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు నిండుకునే పరిస్థితులు నెలకొన్నాయి. ట్యాంకర్ల యజమానులు సమ్మె, బంక్‌ల్లో నిల్వలు పూర్తి స్థాయిలో లేకపోవడం సమాచారం తెలుసుకున్న వాహనాదారులు బంక్‌లకు భారీగా క్యూ కట్టారు. మంగళవారం సాయంత్రం నుంచి జిల్లాలోని బంక్‌లన్నీ వాహనాదారులతో నిండిపోయి కనిపించాయి. అన్ని బంక్‌లలో పెట్రోల్, డీజిల్ కోసం వాహనాలతో క్యూ కట్టారు.రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని ఒక్కో బంక్‌లు రెండు వందలకు పైగా వాహనాలు బారులు తీరాయి. కొన్ని బంకుల వద్ద పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.



భైంసాలోని పెట్రోల్ బంకుల్లో బారులు తీరిన వాహనాలు


ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే

భైంసా రూరల్, జనవరి 2 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. భైంసా మండలం హంపోలి గ్రామంలో ప్రజా పాలన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దరఖాస్తులను స్వీకరించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ అధికారులను ఆదేశించారు.

విలువిద్యలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

నర్సాపూర్(జి), జనవరి 2 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ కొమరంభీం ప్రాంగణంలో అక్టోబర్ మాసంలో జరిగిన జిల్లా స్థాయి విలువిద్య పోటీలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. గణేష్, సతీష్, రంజిత్‌సింగ్, శుభం, జగదీష్‌లు ఎంపికయ్యారని గురువారం భద్రాచలంలో జరిగే టోర్నమెంట్‌కు వెళ్తున్న వెళతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3, కనిష్ఠం 14.0



'జిల్లాలో పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి ఇబ్బంది లేదు'

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 2: జిల్లాలో పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి ఇబ్బంది లేదని, పెట్రోల్ బంక్‌లలో సరిపడేంత నిల్వలు ఉన్నాయని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మవద్దని ఆయన సూచించారు. పెట్రోల్ బంక్‌లలో నిలబడి సమయం వృథా చేసుకోవద్దని, మన జిల్లాకు రోజువారీగా రావాల్సిన ఆయిల్ ట్యాంకర్లు యథావిధిగా వస్తున్నాయని, దీనిపై వివిధ ఆయిల్ కంపెనీలకు చెందిన సేల్స్ ఆఫీసర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.



● ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడ

ప్రగతి.. జాడేది?

- ఉమ్మడి జిల్లాలోని గిరిజన యువత కోసం పారిశ్రామిక వాడల ఏర్పాటు
- కరువైన ఐటీడీఏ అధికారుల ప్రోత్సాహం
- పారిశ్రామిక వాడలో కనిపించని ప్రగతి
- అలంకారప్రాయంగా మారుతున్న పారిశ్రామిక కేంద్రాలు
- అభివృద్ధికి దూరమవుతున్న అడవి బిడ్డలు
- గిరిజనుల దరి చేరని ఉపాధి
- నీరుగారిపోతున్న ఆశయం
- ప్రస్తుతం పారిశ్రామిక వాడలో పాగా వేస్తున్న ఇతరులు
- జిల్లాలోని పోట్లు ఎక్స్ రోడ్ లింగోజి తండా వద్ద 1998లో ఏర్పాటైన గిరిజన పారిశ్రామిక వాడ



ఉట్నూర్, జనవరి 2: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులను పారిశ్రామిక వేత్తలుగా చేయాలన్న ఆకాంక్షలతో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడ ఎలాంటి ప్రగతికి నోచుకోవడం లేదు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన యువతకు ఉపాధి కోసం ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడ అభివృద్ధికి సుదూరం అయ్యింది. ఐటీడీఏ అధికారుల ప్రోత్సాహం కరువవ్వడం వల్లనే పరిశ్రమలు మూత బడ్డాయని స్థానిక గిరిజనులు పేర్కొంటున్నారు. పరిశ్రమలను ఏర్పాటు చేయడంలో చూయించిన ఉత్సాహం.. ఉపాధి కల్పించడంలో అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని, తద్వారా అప్పుల కుప్పలు పెరిగిపోయి పరిశ్రమలు దివాలా తీశాయని గిరిజనులు వాపోతున్నారు.

గిరిజనుల ధరి చేరని ఉపాధి

ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్, ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ గిరిజన యువకులకు పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) అధికారులు ఏర్పాటు చేసిన పారిశ్రామికవాడ అలంకారం ప్రాయంగా మారింది. దీంతో గిరిజనులకు ఉపాధి అందలేదు. 1998లో ఉట్నూర్ ఐటీడీఏ అధికారులు జిల్లా పరిశ్రమల శాఖ అధికారుల సమన్వయంతో పోట్లు ఎక్స్ రోడ్ లింగోజి తండా వద్ద గిరిజన పారిశ్రామిక వాడను ఏర్పాటు చేశారు. ముందుగా ప్రభుత్వ స్థలాన్ని సేకరించిన అధికారులు.. ఉట్నూర్ ఐటీడీఏ అనుబంధంగా ఉండే గిరిజన సంక్షేమ వసతి గృహాలు, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, పండ్ల తోటల ఉద్యానవనాలు, ఇంజనీరింగ్ శాఖ విభాగానికి అవసరమయ్యే వస్తువులు సరుకులను పారిశ్రామికవాడలో ఉత్పత్తి చేసి గిరిజనులకు మార్కెటింగ్ సౌకర్యం కలిగించేలా ప్రణాళికలు చేశారు. ముందుగా పది షెడ్లను ఏర్పాటు చేసి.. రూ.4లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఖర్చు పెట్టి శేషారావుకు పాలిథిన్ బ్యాగుల తయారీ కేంద్రం, పురుక కాశీరాం, గంగారంనాయక్‌లకు నోట్ పుస్తకాల తయారీ, గడ్డం విఠల్‌కు ట్రంకు బాక్సుల తయారీ, రాథోడ్ మోహన్‌కు బ్రెడ్ యూనిట్, గేడం మనోహర్‌కు పప్పుల పరిశ్రమ, ధరంసింగ్ తిలావత్‌కు నూనెల పరిశ్రమ, జాదవ్ లింగాజోకి పసుపు, మిర్చి తయారీ, అలాగే సుధాం శంభుకు ఇంజనీరింగ్ పరిశ్రమ ఏర్పాటుకు అవకాశం కల్పించారు.

నీరుగారిన ఆశయం


ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పారిశ్రామికవాడలోని పాలిథిన్ పరిశ్రమలో ఉత్పత్తి చేసిన ప్లాస్టిక్ కవర్లను ఐటీడీఏ ఆధ్వర్యంలోని పళ్లదొడ్ల ఉద్యాన వనకేంద్రాల్లో అంటు మొక్కల ప్యాకింగ్ కోసం కొనుగోలు చేసి ఉపాధి కల్పించాలని భావించారు. అదేవిధంగా నోటు పుస్తకాల పరిశ్రమలలో ఉత్పత్తి చేసే నోట్‌పుస్తకాలను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాల విద్యార్థుల అవసరాల కోసం కొనుగోలు చేయాలని, ట్రంకు బాక్సులను సైతం విద్యార్థుల కోసం కొనుగోలు చేయాలని, దాల్‌మిల్ ఆయిల్ మిల్‌లలో ఉత్పత్తి చేసే సరుకులు వస్తువులను, పసుపు మిర్చి పరిశ్రమలో ఉత్పత్తి చేసే సరుకులను విద్యార్థుల ఆహార అవసరాల కోసం, ఇంజనీరింగ్ పరిశ్రమ ఉత్పత్తులను ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించే భవనాలకు అవసరమయ్యే తలుపులు, కిటికీలను కొనుగోలు చేయాలన్న సదుద్దేశంతో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేశారు. కానీ కొంత మంది అధికారుల అవినీతి వల్ల గిరిజన పరిశ్రమల్లో వస్తువులు కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చేయడంతో గిరిజనులకు ఉపాధి అందకుండా పోయింది.

మూతబడ్డ పరిశ్రమలు

సంబంధిత శాఖ అధికారుల ప్రోత్సాహం కరువై పోవడంతో 2001లో పారిశ్రామికవాడలోని పరిశ్రమలు మూతబడ్డాయి. ఇక్కడ ఉత్పత్తి చేసిన సరుకులు, వస్తువులకు సరైన మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో సదరు పరిశ్రమలు మూతబడి కరెంట్ బిల్లులు పెరిగి పరిశ్రమల నిర్వాహకులకు అప్పులు పెరిగిపోయాయి. తిరిగి ఐటీడీఏ అధికారులు రెండోసారి కూడా పరిశ్రమలు పునరుద్ధరించి ఎక్కువ కాలం మనలేదు. కొన్నిరోజుల తర్వాత పరిశ్రమల నిర్వాహకులు ధరమ్‌సింగ్ తిలావత్, జాదవ్‌లింగోజీ, సిడాంశంభు తదితరులు వివిధ కారణాలతో మృతి చెందారు. మరికొందరు గ్రామాలకు పరిమితమైన వ్యవసాయం చేసుకుంటున్నారు.

పాగా వేస్తున్న ఇతరులు

ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినా.. మూతబడిన గిరిజన పారిశ్రామిక వాడలో సముదాయాలను దక్కించుకోవడానికి ఇతరులు పాగా వేస్తున్నారు. ఒక షెడ్డులో స్వచ్ఛంద సంస్థ ఉండగా.. మరో షెడ్డులో ఆదివాసీ ఆహార పదార్థాల ఉత్పత్తి నిర్వాహకులు చేరిపోగా.. ఇటీవల కాలంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో పాల సేకరణ కోసం బల్క్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఎలాంటి పరిశ్రమలు లేకపోవడంతో కొన్ని షెడ్లు కూలిపోతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు గిరిజన పారిశ్రామిక వాడను పునరుద్ధరించి గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేలా కృషి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



అధికారుల ప్రోత్సాహం కరువైంది
: శేషారావు, పాలిథిన్ కవర్ల పరిశ్రమ నిర్వాహకుడు



పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయడంలో ఉత్సాహం చూపించినా.. అధికారులు గిరిజన యువకులను ప్రోత్సహించడంలో విఫలమయ్యారు. ఐటీడీఏ ఆధ్వర్యం లోని పండ్ల తోటల ఉద్యానవన కేంద్రాలకు, ప్లాస్టిక్ సంచులను కొనుగోలు చేయక పోవడంతో ఇబ్బందులు పడ్డాం. నాలాగే, మిగతా పారిశ్రామికవేత్తలకు కూడా మార్కెటింగ్ సౌకర్యంలో ఇబ్బందులు రావడంతో పరిశ్రమలు నడపలేక పోయాయి.

సిక్ యూనిట్లను కొత్తవారికి కేటాయిస్తున్నాం
: సున్నం రాంబాబు, ఐటీడీఏ పరిపాలనా అధికారి, ఉట్నూర్



ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఎక్స్ రోడ్డులో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడలో మూతబడిన పరిశ్రమల షెడ్‌లను కొత్త అభ్యర్థులకు ప్రాజెక్టు అధికారి కేటాయించాలని భావిస్తున్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తిరిగి పరిశ్రమలను పునరుద్ధరించుకోవచ్చు.

సంక్షిప్త సమాచారం

4న నాగోబా జాతరపై సమీక్ష

ఇంద్రవెల్లి, జనవరి 2: ఆదివాసీల ఆరాధ్యదైవం ఫిబ్రవరి 9నుంచి ప్రారంభం కానున్న నాగోబా జాతర ఏర్పాట్లపై ఈనెల 4న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌ల ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు దేవాదాయ శాఖ ఈవో రాజమౌళి మంగళవారం ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. ఈనెల 4న కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో ఉదయం 11 గంటలకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరై సమీక్ష సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 2: దుర్గానగర్‌లోని నవశక్తి దుర్గామాతను ఎమ్మెల్యే పాయల శంకర్ దర్శించుకున్నారు. 2023 ఎన్నికల ప్రచారాన్ని దుర్గానగర్‌నవశక్తి ఆలయం నుంచి ప్రారంభించారు. ఎన్నికల అనంతరం అమ్మవారి దర్శనం చేసుకుని ఆలయ నిర్వాహకులు కిషన్ మహారాజ్ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవశక్తి అమ్మవారి కృపతో విజయం చేకూరిందని తెలిపారు. ఆయన వెంట జిల్లా నాయకులు, కార్యకర్తలున్నారు.

'ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి'

నేరడిగొండ, జనవరి 2: ప్రతీఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని తమ స్వగ్రామం రాజురా గ్రామంలో ఉన్న శ్రీజగదాంబదేవి సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల్లో ప్రతినిత్యం పూజలు చేయడం ద్వారా గ్రామాలలో సుఖశాంతులు నెలకొంటాయన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

న్యాయాధికారిని కలిసిన ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 2: జిల్లా న్యాయాధికారి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్‌ని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో మర్యాదపూర్వకంగా పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు అధికారులు పరస్పరం లోక్ అదాలత్, కోర్టు కేసుల విషయాలపై చర్చించుకున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ ● జిల్లాలో కొనసాగుతున్న 'గ్రామ పాలన' కార్యక్రమం ● అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ

జైనథ్, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బహదూర్‌పూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రజలు, లబ్ధిదారులు నేరుగా పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను నేరుగా పంచాయతీ కార్యదర్శుల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం గ్రామ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్లలో స్థానికుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.రాధిక, ఉప సర్పంచ్ జి.పోతారెడ్డి, ఎంపీడీవో వి.గజానన్‌రావ్, ఐకేపీ ఏపీఎం భగవాన్, సీసీ జి.గంగారాం, ఏఈవో విశాల్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



బహదూర్‌పూర్‌లో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

● 'అర్జీల స్వీకరణ నిరంతర ప్రక్రియ'

ఉట్నూర్: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజాపాలన అర్జీల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని, ప్రజలు ఎవరు కూడా ఇబ్బందులకు గురికావద్దని ఎంపీడీవో బోడ తిరుమల అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తులను స్వీకరించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఈ నెల 6 వరకు గ్రామసభల ద్వారా దరఖాస్తులు తీసుకోవాలని ఆదేశించినప్పటికీ.. దరఖాస్తులు ఇవ్వడంలో ఆలస్యానికి గురైన వారు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించుకోవాలని సూచించారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కాకుండా మహిళలు పురుషులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి ఒంకర్, సిబ్బంది మనోహర్, అంజిత్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అర్జీలను స్వీకరించారు. సాకెర(బి) గ్రామ పంచాయతీలో ఇప్పుడు చేసిన ప్రజాపాలన గ్రామ సభలో ఎంపీవో మహేశ్‌కుమార్ ఆధ్వర్యంలో అర్జీలు స్వీకరించారు. మంగళవారం మండలంలోనిఎందా, మారుగూడ, జైత్‌రామ్ తండాలలో గ్రామసభలు నిర్వహించారు.

● అర్హులకు అందేలా కృషి : ఎమ్మెల్యే పాయల

మావల: అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం అదిలాబాద్ రూరల్ మండలం యాపాలగూడ గ్రామంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పథకాలు ప్రవేశ పెడుతున్న ఈ పథకాలను అర్హులైన ప్రజలందరికీ అందేలా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, సర్పంచ్ గంగారాం, ప్రజాప్రతినిధులు, అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● పార్టీలకు అతీతంగా పాలన : ఎమ్మెల్యే అనిల్

నేరడగొండ: పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమ పాలన అందిస్తామని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో గల స్థానిక రైతు వేదికలో నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తు ఫారాలను బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పరిశీలించి మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా దరఖాస్తులు స్వీకరించాలన్నారు. అనంతరం సావర్గాం గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఇందులో నేరడిగొండ, ఇచ్చోడ ఎంపీపీలు రాథోడ్ సజన్, ప్రీతంరెడ్డి, సర్పంచ్‌లు పీవీ రమణ, కళ్యాణి మహేందర్, దేవేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పండరి నానక్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.



నేరడిగొండలో దరఖాస్తులు తీసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



యాపల్‌గూడలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న డీడీ దిలీప్‌కుమార్

గిరిజన విద్యార్థులు సత్తా చాటాలి : డీడీ

ఉట్నూర్, జనవరి 2: ఇంటర్ సొసైటీ లీగ్ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా గిరిజన విద్యార్థులు సత్తా చాటాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కొమురంభీం ప్రాంగణంలోని క్రీడా మైదానంలో 19ఏళ్ల లోపు విద్యార్థులను రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. ఐఎస్ఎల్ రాష్ట్రస్థాయి లీగ్ పోటీలు ఈనెల 16నుంచి ఉట్నూర్‌లో తలపెట్టినందున లీగ్ పోటీల్లో పాల్గొనే జిల్లాస్థాయి జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఒక్కో విద్యార్థి ఒక క్రీడను ఎంపిక చేసుకుని ప్రతిభను చాటాలన్నారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విద్యా సంస్థలతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జాతీయ స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన ఉట్నూర్ క్రీడా పాఠశాల గిరిజన విద్యార్థులు సిడంనవీన్, మెస్రం నిఖిల్, కొంరం సురేందర్, సిడాం శంకర్, రాథోడ్ విక్రమ్‌లను అభినందించి సన్మానించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఈనెల 8నుంచి ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, బీఎడ్ కళాశాల ప్రిన్సిపల్ మేస్రం మనోహర్, ఏటీడీవో క్రాంతికుమార్, ఫిజికల్ డైరెక్టర్లు జాదవ్ హేమంత్‌నాయక్, లక్ష్మణ్, గోపాల్, శ్రీనివాస్, రవీందర్, మధుసూదన్, విశ్వనాథ్, జైవంతరావు, సుజాత, స్వప్న, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల బాలికల విద్యార్థుల ప్రతిభ

ఇచ్చోడ, జనవరి 2: ఖమ్మం జిల్లా సూదిమల్లలో నిర్వహించిన ఏడవ రాష్ట్రస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో ఇచ్చోడ గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన వైష్ణవి 800 మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్, అర్చన బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్, పల్లవి టెన్నికాయిట్‌లో రెండవ స్థానంలో పతకాలు సాధించడంతో పాటు ఓవరాల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కూడా కైవసం చేసుకోవడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రావు, అశ్విని, లక్ష్మి, పీడీ గంగామని, నందిని, లత, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖ డైరెక్టర్‌ను కలిసిన బొజ్జు

ఉట్నూర్, జనవరి 2: ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి వైద్య ఆరోగ్య శాఖ సహకరించాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ మంగళవారం హైదరాబాద్‌లో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్‌ను కోరారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక మర్యాదపూర్వకంగా కలిశారు. ఉట్నూర్‌లో నిర్మిస్తున్న టీహబ్‌ని త్వరగా పూర్తిచేసి రానున్న రెండు, మూడు నెలల్లో ప్రజలకు అందుబాటులో తీసుకురావడం జరుగుతుందని ఆర్వీ కర్ణన్ పేర్కొన్నారని తెలిపారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న తాత్కాలిక స్టాఫ్‌నర్సుల సమస్యలపై విన్నవించి పరిష్కారం చేయాలని కోరారు. ప్రస్తుతం భర్తీ చేస్తున్న స్టాఫ్‌నర్సు ఉద్యోగాలలో వారికి వెయిటేజి మార్కులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా ఏజెన్సీలో ఉన్న వైద్య సదుపాయాల గురించి సిబ్బంది గురించి చర్చించడం జరిగిందని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పేర్కొన్నారు.



కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను కలిసిన ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు

గత ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల ఇబ్బందులు

● ఎమ్మెల్యే పాయల శంకర్ ● మార్కెట్‌లో ట్రాఫిక్, మున్సిపల్ అధికారులతో పరిశీలన ● చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 2: జిల్లాకేంద్రంలోని మార్కెట్, ట్రాఫిక్ సమస్యలపై ట్రాఫిక్ ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాయల శంకర్ మార్కెట్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతు పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు, ప్రస్తుత మున్సిపల్ పాలక పక్షం చేసిన అనాలోచిత చర్యల వల్ల పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అవసరం ఉన్న చోట డివైడర్లు వేయకుండా, ట్రాఫిక్ సమస్యలు ఉన్న చోట కాకుండా సమస్యలు సృష్టించే విధంగా నిర్మాణాలు జరిగాయన్నారు. కిసాన్‌చౌక్ (పంజాబ్ చౌక్) నుంచి తాంసి బస్టాండ్ వెళ్లాలంటే వెటర్నరీ ఆసుపత్రి వరకు తిరిగి వెళ్లాల్సి ఉంటుందని, తాంసి బస్టాండ్ వైపు నుంచి అంబేద్కర్‌చౌక్ వైపు వెళ్లాలంటే తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అనుకోని పరిస్థితులలో రాంగ్‌రూట్లో వెళ్తే పోలీసులు చలాన్లు వేస్తున్నారని, ఈ సమస్యకు పరిష్కారం వెంటనే చూడాల్సి ఉందన్నారు. డైట్ కాలేజ్ గ్రౌండ్ వద్ద రవీంద్రనగర్ నుంచి వచ్చే వాళ్లకి నేతాజీచౌక్ వెళ్లాలంటే రైతుబజార్, వినాయక్‌చౌక్ వైపు వచ్చి అటు ఎన్టీఆర్‌చౌక్ వైపు నుంచి తిరిగి రావాల్సి వస్తుందనిన్నారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, దేవిచౌక్, శివాజీచౌక్ ఈ ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించుకున్న చిరు వ్యాపారాలకు స్థలం చూపించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వీధి వ్యాపారులకు సరైన ప్రత్యామ్నయం చూపించి రోడ్లపై అక్రమించుకుని ఉన్న తోపుడుబండ్లను, పర్మినెంట్ టేలాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో పోలీసు అధికారులు, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు, బీజేపీ జిల్లా, పట్టణ నాయకులు పాల్గొన్నారు.